గుడుంబా నిషేధంపై ప్రతిజ్ఞ

దహెగాం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం బామానగర్‌లో ప్రజలు, యువకులు సోమవారం గుడుంబా నిషేదంపై ప్రతిజ్ఞ చేశారు. గుడుంబా సేవించడంలో మానవాళికి ఎన్నో పిర్యాదులు చోటు చేసుకుంటున్నాయని కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆవేదన చెందారు. గ్రామంలో గుడుంబా తయారు చేసినా, విక్రయించినా, రవాణా చేసినా పోలీసులకు సమాచారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.

పత్తి రైతుకు 'కపాస్' కష్టాలు

- ఏజెన్సీ ప్రాంతాల్లో వేధిస్తున్న సిగ్నల్స్ సమస్యలు
- స్లాట్ బుకింగ్ కోసం తప్పని ఇబ్బందులు



కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఏఈవో

వాంకిడి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పత్తి అమ్మకాల కోసం కేంద్రప్రభుత్వం కొత్తగా తెచ్చిన కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్ నిబంధన రైతులకు ఇబ్బంది కరంగా తయారైంది. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 3.50 లక్షల ఎకరాలకుపైగా పత్తి సాగవుతుంది. చేతికొచ్చిన పంటను మార్కెట్లో విక్రయించుకోవాలంటే ముందుగా రైతులు కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలి. ఇందులో రైతు పేరు, ఊరు, సర్వే నంబరు, సాగుచేసిన పంటల విస్తీర్ణం తప్పనిసరి నమోదు చేయాల్సి ఉంటుంది. తేమ 12 శాతం దాటితే సీసీఐ అసలు కొనుగోలు చేయదు. తేమ శాతమే ప్రతిబంధకంగా మారుతుందనుకుంటే ఈ ఏడాది కొత్తగా కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలనే నిబంధన రైతులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ఇలాంటి నిబంధనలు విధించడంతో రైతులు నష్టపోయే అవకాశం ఉందనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది.

ఏజెన్సీ ప్రాంతాల్లో సిగ్నల్ సమస్య

ఆసిఫాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఫోన్ సిగ్నల్స్ సరిగా పనిచేయవు. పింఛన్లు, రేషన్ బియ్యం పంపిణీ కోసం ప్రభుత్వ సిబ్బంది, డీలర్లు అనేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో పత్తిని ప్రధాన పంటగా రైతులు సాగు చేసుకుంటున్నారు. జిల్లాలోని ఆసిఫాబాద్, తిర్యాణి, వాంకిడి, బెజ్జూరు, చింతలమానేపల్లి, కెరమెరి, జైనూర్ లాంటి మారుమూల ప్రాంతాల్లో కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్‌బుక్ చేసుకోవడమనేది రైతులకు పరీక్షలా మారనుంది. వ్యవసాయ అధికారులు కపాస్ కిసాన్ యాప్‌పై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా యాప్‌పై సరైన అవగాహన కలగడంలేదని రైతులు పేర్కొంటున్నారు. మారుమూల ప్రాంతాల్లో అనేక మంది నిరక్షరాస్యులైన రైతుల వద్ద స్మార్ట్ ఫోన్‌లు కూడా లేకపోవడంతో స్లాట్ బుకింగ్ రైతులకు మరింత ఇబ్బందికరంగా మారే అవకాశాలు ఉన్నాయని రైతులు వాపోతున్నారు. జిల్లావ్యాప్తంగా పత్తి కొనుగోళ్లు ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు కపాస్ కిసాన్ యాప్‌పై సరైన అవగాహనలేక అనేక మంది రైతులు స్లాట్ బుకింగ్ చేయలేక పత్తి విక్రయించలేని పరిస్థితి నెలకొందని కొత్తగా ప్రభుత్వం తీసుకువచ్చిన నిబంధనలు సడలించిపత్తికొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

స్లాట్ బుకింగ్‌పై ఆందోళన

మార్కెట్‌కు వెళ్లే 24 గంటల ముందు రైతులు కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. అప్పటికప్పుడు విక్రయించే రోజున స్లాట్ బుకింగ్ చేసుకునే వీల్లేదని అధికారులు చెబుతున్నారు. దీంతో స్లాట్ బుకింగ్‌పై అవగాహనలేని రైతులు పత్తి విక్రయాలపై ఆందోళనలకు గురవుతున్నారు. సరైన సిగ్నల్స్ లేకపోవడం, స్లాట్ బుకింగ్‌పై అవగాహన లేకపోవడంతో స్లాట్ బుకింగ్‌పై అనిశ్చితి నెలకొంది. అనేక మంది రైతులకు సంబంధించిన సెల్‌ఫోన్ నంబర్లు మారిపోవడం, కొంతమంది రైతులకు ఫోన్‌లేకపోవడంతో వ్యవసాయ కార్యాలయంలో రైతుల ఫోన్‌నంబర్లు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. పత్తి విక్రయించేందుకు స్లాట్‌బుకింగ్ తప్పనిసరిగా చేయాల్సి ఉంది. సెల్‌ఫోన్ నంబరు వ్యవసాయ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో నమోదై ఉంటేనే స్లాట్‌బుక్ అయినట్లు ఓటీపీ వస్తుంది. వ్యవసాయ కార్యాలయంలో ఫోన్ నంబరు నమోదుకాని రైతులు అయోమయ స్థితిలో ఉన్నారు.

స్లాట్ బుక్ చేయడం ఇబ్బందిగా ఉంది..

- గుర్నులే మెంగాజీ, రైతు



ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేయడం ఇబ్బందిగా తయారైంది. వ్యవసాయ అధికారులు స్లాట్ బుకింగ్‌పై అవగాహన కల్పిస్తున్న బుకింగ్ చేయడానికి రావడంలేదు. సక్రమంగా సిగ్నల్స్ లేకపోవడంతో స్లాట్ బుకింగ్ చేయలేక పోతున్నాము. ప్రభుత్వం కొత్తగా తీసుకున్న వచ్చిన స్లాట్ బుకింగ్ నిబంధనలు రైతులకు అనుకూలంగా లేవు. పత్తి విక్రయాలపై రైతులకు ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం చూడాలి.

యాప్‌పై అవగాహన కల్పిస్తున్నాము..

- గోపికాంత్, వ్యవసాయ అధికారి



ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన కపాస్ కిసాన్ యాప్ స్లాట్ బుకింగ్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్నాము. అనేకమంది రైతులకు సంబంధించిన ఫోన్ నంబర్లు వ్యవసాయ కార్యాలయంలో నమోదు కాలేదు. క్లస్టర్ల వారిగా స్లాట్ బుకింగ్‌పై అవగాహన కల్పిస్తూ ఫోన్ నంబర్లు లేని రైతుల వద్ద నంబర్లు తీసుకొని నమోదు చేస్తున్నాము. ఫోన్ నంబర్లు నమోదు చేయని రైతులు వ్యవసాయ కార్యాలయంలో నమోదు చేసుకోవాలి.

ముగిసిన మద్యం దుకాణాల ఎంపిక

- లక్కీడ్రా ద్వారా కేటాయింపు
- ఏడు దుకాణాల డ్రా వాయిదా



లక్కీడ్రా ద్వారా విజేతలను ప్రకటిస్తున్న కలెక్టర్ వేంకటేష్ ధోత్రే

ఆసిఫాబాద్ అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2025-27కు సంబంధించి మద్యం దుకాణాలకు జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవనంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన లక్కీ డ్రా ప్రశాంతంగా ముగిసింది. కలెక్టర్ వేంకటేష్ ధోత్రే, అదనపు కలె క్టర్ డేవిడ్, జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్‌లతో కలిసి లక్కీ డ్రా ద్వారా విజేతలను ఎంపిక చేశారు. జిల్లాలోని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలో మొత్తం 32 మద్యం దుకాణాలకు గాను 680 దరఖాస్తులు వచ్చాయి.

వీటిలో షాపునంబర్ 9(రెబ్బెన), షాపునంబర్ 10 (గోలేటి), షాపునంబర్ 14(కాగజ్‌నగర్‌లోని సర్‌సిల్క్ ఏరియా), షాపునంబర్ 22(రవీంద్రనగర్), షాపునంబర్ 30 (జైనూర్-1), షాపునంబర్ 31(జైనూర్-2) షాపు నంబర్ 32(సిర్పూర్(యూ), దుకా ణాలకు దరఖాస్తులు తక్కువ రావడంతో ఉన్నతాధికారుల ఆదే శాల మేరకు ఏడు దుకాణాలకు సంబంధించిన డ్రాను వా యిదా వేశారు. మిగిలిన 25 దుకాణా లకు లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. ఇందులో మొదటగా ఆసిఫాబాద్ డివిజన్‌లోని మద్యం దుకాణాలకు తర్వాత కాగజ్‌నగర్ డివిజన్‌లోని మద్యం దుకాణాలకు లక్కీ డ్రా నిర్వహించారు.



డ్రాలో పాల్గొన్న దరఖాస్తుదారులు

ఈ సందర్భంగా కలెక్టర్ వేంకటేష్ ధోత్రే మాట్లాడుతూ మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ లక్కీ డ్రా పద్ధతిన పూర్తి పారదర్శకంగా నిర్వహించామని తెలి పారు. అనంతరం జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్ మాట్లాడుతూ రెండు సంవత్సరాల ఒప్పందం ద్వారా మద్యం దుకాణా లను కేటాయించడం జరిగిందన్నారు. ప్రభుత్వ విధానాలకనుగుణంగా నియమనిబంధ నలకు లోబడి మద్యం దుకాణాలు నడుపవలసి ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐలు, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లక్కీ విజేతలు వీరే..

జిల్లాలోని మద్యం దుకాణాలకు లక్కీ డ్రా ద్వారా విజేతలను ఎంపిక చేశారు. ఆసిఫాబాద్ డివిజన్‌లోని ఆసిఫాబాద్ షాప్‌నంబర్- 1 వసంత్‌రావ్, షాప్‌నంబర్- 2 అశోక్, షాప్‌నంబర్- 3 వినోద్, షాప్‌నంబర్-4. జగన్, షాప్‌నంబర్- 5. సంతోష్ కూమార్, షాప్‌నంబర్- 6. రజీత, షాప్‌నంబర్- 7. సుదర్శనం, షాప్‌నంబర్-8. సం తోష్, షాప్‌నంబర్-11 ప్రహ్లద్, షాప్‌నంబర్-12 నరేష్, షాప్‌నంబర్-13 రవిందర్ గౌడ్ దుకాణాలను దక్కించు కున్నారు.

కాగజ్‌నగర్ డివిజన్‌లోని కాగజ్‌నగర్ షాప్‌నంబర్-15 అశ్విని, షాప్‌నంబర్-16 లక్ష్మణ్ కూమార్, షాప్‌నంబర్-17 శ్రీకాంత్‌రెడ్డి, షాప్‌నంబర్-18 దాసరి వైకుంఠం, షాప్ నంబర్-19 రాచర్ల వైకుంఠం, షాప్‌నంబర్-20 విఠల్, షాప్‌నంబర్-21 నిఖిత, షాప్‌నంబర్- 23 నగేష్, షాప్ నంబర్-24 ఉపేంద్రచారి, షాప్‌నంబర్-25 సంపత్ కూమార్, షాప్‌నంబర్-26 విఘ్నేష్, షాప్‌నంబర్-27 బావాజీ, షాప్‌నంబర్-28 మల్లికార్జున్‌గౌడ్, షాప్ నంబర్-29ను మల్లేష్ దక్కించుకున్నారు.

ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి

ఆసిఫాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పురపాలక సంఘం పరిధిలో వ్యాపారం నిర్వహించుకునే వ్యాపార సముదాయాల యజమానులు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ డి గజానంద్ తెలిపారు. ట్రేడ్ లైసెన్స్ తీసుకోకుండా వ్యాపారం చేస్తే యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కేటీఆర్‌ను కలిసిన నాయకులు

సిర్పూర్(టి), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో జరుగుతున్న ఉపఎన్నికల్లో భాగంగా నిర్వహించిన సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను సిర్పూర్(టి) మండల నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నాయకులు కీజర్‌హుస్సేన్, సుభాన్, బాబా, నాజీం ఉన్నారు.

సైబర్ మోసం చేసిన ఇద్దరు నిందితుల అరెస్టు

- ఎస్పీ కాంతిలాల్ పాటిల్

ఆసిఫాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వాట్సాప్‌కి ఆన్‌లైన్ లింకులను పంపించి వాటి ద్వారా సైబర్ మోసం చేసిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆసిఫాబాద్ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుదారు ఆన్‌లైన్‌లో డబ్బులు పోగొట్టుకొని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆసిఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. ఫిర్యాదారులు గుర్తుతెలియని వ్యక్తులు ఆన్‌లైన్‌లో మోసం చేసి తమ అకౌంట్ నుంచి రూ.1,66,000 మోసం చేసి తీసుకోగా అందులో నుంచి రూ.60 వేలు ఫ్రీజ్ కావడం జరిగిందని తెలిపారు. సైబర్ క్రైంకు పాల్పడిన వ్యక్తులను గుజరాత్‌కు చెందిన వారుగా జిల్లా ఏఎస్పీ చిత్తరంజన్, సీఐ బాలాజీ వరప్రసాద్ ఆధ్వర్యంలో గుర్తించామన్నారు. గుజరాత్ రాష్ట్రంలోని పంకజ్ బాయి (29), నల్లు శైలేష్ మకావన (23)లుగా గుర్తించి వారిని ఈ నెల 23న గుజరాత్ రాష్ట్రంలో అరెస్టు చేసి ట్రాన్సిట్ వారెంట్‌లో అక్కడే తారాపూర్ జడ్జి ఎదుట హాజరుపరచగా నేరం ఒప్పుకున్నారన్నారు. వారిని అక్కడి నుంచి ఈ నెల 24న ఆసిఫాబాద్ పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని సీజ్ చేశామని తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్పీ

బాధితుల అకౌంట్‌లో నుంచి యూపీఐ ఐడీ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయించుకుని మోసం చేశారన్నారు. వారు మే 21 నుంచి 28 వరకు ఎంతో మందిని మోసం చేసి మొత్తం రూ.3,47,000 నగదును బదలాయించు కున్నారన్నారు. వీరిని ఆదివారం రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. సైబర్ నేరగాళ్లను పట్టుకోవడానికి కృషి చేసిన సీఐ బాలాజీ వరప్రసాద్, సైబర్ క్రైం బృందాన్ని అభినందించారు. ప్రజలు సోషల్ మీడియా లేదా వాట్సాప్ లింకుల ద్వారా వచ్చే ఆఫర్లను నమ్మి క్లిక్ చేయవద్దన్నారు. సైబర్ మోసా లు ఎదురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్ లేదా సమీప పోలీసుస్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లపై కఠినచర్య లు కొనసాగుతాయని ఇటువంటి మోసగాళ్లను ఎట్టి పరిస్థితుల్లో వదిలి పెట్టబోమని స్పష్టం చేశారు.

వాంకిడి ఎంపీడీవోగా పాటిల్ జ్యోత్స్న



వాంకిడి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వాంకిడి ఎంపీడీవోగా పాటిల్ జ్యోత్స్న సోమవారం బాధ్యతలు స్వీకరించారు. టీజీపీఎస్సీ గ్రూపు-1 ద్వారా ఎంపికయ్యారు. ఈ నెల 13 నుంచి 25 వరకు శిక్షణ పూర్తిచేసి వాంకిడి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీవో జావీద్, ఏపీవో శ్రావణ్‌కుమార్, కార్యదర్శులు, సిబ్బంది ఆమెను శాలువాతో సన్మానించారు.

ఎంపీడీవోగా సురేష్ బాధ్యతల స్వీకరణ



ఎంపీడీవో సురేష్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

కెరమెరి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కెరమెరి ఎంపీడీవోగా వి సురేష్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో అంజద్‌పాషా నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇకపై అంజద్‌పాషా ఎంపీవోగా వ్యవహరించనున్నారు. ఈమేరకు కార్యాలయ ఎంపీడీవోను ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీవో మల్లయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ ఎంపీడీవోగా ఉజ్వల్ కుమార్



కాగజ్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఎంపీడీవోగా సీహెచ్ ఉజ్వల్‌కుమార్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గ్రూప్-1 పరీక్ష ద్వారా ఎంపికైన ఉజ్వల్‌ను రాష్ట్ర ప్రభుత్వం కాగజ్‌నగర్ మండలానికి కేటాయించింది. గతంలో వాసుదేవ్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా పని చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఉజ్వల్‌కుమార్ మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

గిరిజనులకు నిత్యావసర సరుకుల పంపిణీ

వాంకిడి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం వాంకిడి మండలంలోని సరికేపల్లి గ్రామంలో 30 మంది గిరిజన కుటుంబాకులు ఎస్సై మహేందర్ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు ప్రజల భద్రత కోసం ప్రాణాలు అర్పించారన్నారు. వారి త్యాగాన్ని స్మరించుకుంటూ సమాజంలోని బలహీనవర్గాలకు సహాయం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ

కెరమెరి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మధుకర్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారుడు ప్రతీఒక్కరు హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ వాడకపోవడం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. మంగళవారం పోలీసుస్టేషన్ ఆవరణలో నిర్వహించే రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఎస్సై కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో అంజద్‌పాషా, తహసీల్దార్ సంతోష్‌కుమార్, పోలీసు సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.



కెరమెరిలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మున్సిపల్ కమిషనర్ డి గజానంద్



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ గజానంద్

ఆసిఫాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ డి గజానంద్ సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రజలకు మత్తు పదార్థాల నిషేదం, వాటి దుష్ప్రభావాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉంచడంలో ప్రతీఒక్కరు తమ వంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ సర్వర్, టీఎంసీ అరుణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఆసిఫాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ వల్ల పంట నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టెఫెన్ రవీంద్ర, అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు మాట్లాడుతూ రాబోయే రెండు, మూడు రోజుల్లో తుఫాన్ వల్ల అకాల వర్షాల కారణంగా వరి ధాన్యం, పత్తి, మొక్కజొన్న సోయా పంట కొనుగోలు ప్రక్రియకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రైతుల వద్ద నుంచి నిబంధనల ప్రకారం మద్దతు ధరతో ఆయా పంట ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ఆదేశించారు.

జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీసీ హాల్ నుంచి కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, జిల్లా వ్యవసాయ, పౌరసరఫరాలు, మార్కెటింగ్, రవాణా, గ్రామీణాభివృద్ధి శాఖల అధకారులతో హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు చేయడం కోసం 40 కేంద్రాలు ప్రారంభిస్తామని తెలిపారు. ఇప్పటి వరకు 24 ధాన్యం కొనుగోలు కేంద్రా లు ప్రారంభించి కొనుగోలుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. జిల్లాలో పత్తి కొనుగోలుకు సీసీఐ ఆధ్వర్యంలో 18 జిన్నింగ్ మిల్లులను గుర్తించి నవంబరు మొదటి వారంలో పత్తి కొనుగోలుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వచ్చే రెండు, మూడు రోజుల్లో తుఫాన్ వల్ల పంటలు నష్ట పోకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్ర మంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, మార్కెటింగ్ శాఖ అధికారి అస్వక్ అహ్మద్, రవాణా శాఖ అధికారి రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్, సబ్ కలెక్టర్లు

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరగా పరిషకరించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆసిఫాబాద్ మండలం రౌటసంకెపల్లి గ్రామానికి చెందిన పోతిని చిన్నవెంక టస్వామి తనకు గల భూమిలో అయిల్‌పామ్ సాగు చేస్తున్నాని ఉత్పత్తి అయినందున విక్రయించేందుకు సరైన రోడ్డు సౌకర్యం కల్పించాలని దరఖాస్తు అందజేశారు. పెంచికలపేట మండల కేంద్రానికి చెందిన పాముల నందు తాను గతంలో ఎల్లూరు గ్రామ శివారులో కొనుగోలు చేసిన భూమికి పట్టా మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు.

కాగజ్‌నగర్ పట్టణం ద్వారకానగర్ కాలనీకి చెందిన కత్తెరపాక ప్రమీల తనకు గతంలో ఆసరా పెన్షన్ వచ్చేదని ఆరు సంవత్సరాలుగా రావడంలేదని ఇప్పించాలని కోరారు. లింగాపూర్ మండల కేంద్రానికి చెందిన బానోత్ అనూష బాయి తనకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కౌటాల మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన పాలకుర్తి సంతరక్క తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. బెజ్జూరు మండలం సోమిని గ్రామానికి చెందిన లింగయ్య తన భూమి ధరణి పోర్టల్‌లో ఇరుల పేరిట పట్టా అయినందున సరవరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాగజ్‌నగర్ పట్టణంలోని న్యూకాలనీకి చెందిన కామెర మాధవి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, రెబ్బెన మండలం కొండపల్లి బుద్ధనగర్ కాలనీలో తాము 20 కుటుంబాలు నివాసం ఉంటున్నామని తమకు ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తిర్యాణి మండలం మాణిక్యాపూర్ గ్రామానికి చెందిన టేకం పోసుబాయి తాను ఐదో తరగతి వరకు చదివానని, కిరాణాషాపు ఏర్పాటు కోసం సమగ్ర గిరిజన అభి వృద్ధి సంస్థ, గ్రామీణాభివృద్ధి సంస్థలో మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్నానని రుణం మంజూరు చేయాలని కోరారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్జీదారులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

సిర్పూర్(టి), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యంపై గ్రామ పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. సోమవారం మండలంలోని చింతకుంట, అచ్చెల్లి, చుచ్చుపల్లి గ్రామ పంచాయతీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చింతకుంట గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. గ్రామపంచాయతీల్లో మిషన్ భగీరథ నీరు, పారిశుధ్యం, మురికి కాలువలు శుభ్ర పర్చాలని, చెత్తా చెదారం లేకుండా దృష్టి సారించాలన్నారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి పనులను వేగవంతం చేయాలన్నారు. ఆయన వెంట కార్యదర్శులు లక్ష్మి, శ్రీలత తదితరులు ఉన్నారు.

బాధితులకు సత్వరన్యాయం జరిగేలా చూడాలి

- ఎస్పీ కాంతిలాల్ పాటిల్


మాట్లాడుతున్న ఎస్పీ

ఆసిఫాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాల యంలో ప్రజాఫిర్యాదుల విభాగంలో అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్ట ప్రకారం సవరించాల్సిందిగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. డీఎస్పీ, ఏఎస్పీ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని, పరిష్కారానికి సూచనలు చేశారు. ప్రజలు నిర్భయంగా మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా పోలీసులు, ప్రజలకు మరింత దగ్గరయ్యేలా శాంతిభద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యం గా జిల్లా పోలీసుశాఖ పనిచేస్తుందని అన్నారు. ప్రజాసమస్యలపై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమం సమస్యలు పరిష్కరిస్తున్నామని ఎస్పీ తెలిపారు.

ఎస్టీపీపీ అధికారికి పదోన్నతి

జైపూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎస్టీపీపీలో ఏజీఎం (పీసీఎస్)గా విధులు నిర్వహిస్తున్న మదన్‌మోహన్‌కు జనరల్ మేనేజర్ (ఈఅండ్ఎం)గా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా సోమవారం మదన్ మోహన్ ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం నరసింహారావును మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో అధికారులు అజాజుల్లాఖాన్, వేణుగోపాల్, పంతుల, కిరణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు బస్సులు భద్రమేనా?



- భద్రత ప్రమాణాలు పాటించక ప్రయాణికుల ఇక్కట్లు
- అరచేతిలో ప్రాణాలతో ప్రయాణాలు
- సికింద్రాబాద్-ఛత్తీస్‌గఢ్ మధ్య ప్రైవేట్ బస్సుల జోరు
- నిబంధనలకు పాతర
- ప్రమాదాలు జరుగుతున్నా తేరుకోని అధికారులు

కాగజ్‌నగర్ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ సమీపంలో జరిగిన ప్రైవేటు ట్రావెల్స్ ఘోర ప్రమాదం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు రాత్రివేళ ద్విచక్ర వాహనం ఢీకొని మంటల్లో కాలిపోవటంతో 20 మందికిపైగా ప్రయాణికులు దుర్మరణం చెందారు. ఈ ఘటన ఇప్పుడు ప్రైవేటు బస్సుల్లో భద్రతా ప్రమాణాల లేమిపై మరలా దృష్టి సారింపజేస్తోంది. సికింద్రాబాద్ నుంచి ఛత్తీస్‌గడ్ (రాయ్‌పూర్)కు నిత్యం ప్రైవేటు బస్సులు రాత్రి వేళల్లో నడుస్తున్నాయి. ఈ బస్సుల్లో అరకొర వసతులతో, సరిగా పనిచేయని అత్యవసర ద్వారాలు, ఫైర్ నివారణకు చర్యలు లేకుండానే ప్రయాణికులతో తరలిస్తున్నారు.

ఈ బస్సులపై ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చినప్పుడల్లా అధికారులు నామ మాత్రంగా తనిఖీలు నిర్వహించి వదిలేస్తుండటంతో వీరి వ్యాపారానికి బ్రేక్ వేయలేని పరిస్థితి ఏర్పడింది. రాత్రివేళల్లో వస్తుండటంతో అంతా మాముళ్ల ఇస్తు యథేచ్ఛగా నడిపిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ విషయంలో సంబంధిత జిల్లా అధికారులు దాటవేసే ధోరణి అవలంబిస్తున్నారే తప్ప చర్యలు తీసుకున్న దాఖలాలు కనబడడం లేదు.

ఏడాది క్రితం ఓ బస్సు కాగజ్‌నగర్ పెద్దవాగు బ్రిడ్జి వద్ద చెడి పోయినప్పటికీ అతివేగంగా మూడు కిలోమీటర్ల దూరంలోని కాగజ్‌నగర్‌కు అలాగే తీసుకెళ్లారు. కొంత మంది వాహనదారులు ఈ బస్సును చెక్ పోస్టు సమీపంలో ఆపేశారు. అనంతరం నాలుగు గంటల పాటు ఆపి కొత్తటైరు బిగించుకొని బయలుదేరింది. ఈ సంఘటనలో ప్రమాదం జరిగి ప్రయాణికులు మృత్యువాత పడితే ఎవరు బాధ్యులు..? అన్న ప్రశ్నలు తలెత్తిన కూడా ఇంత వరకు ఈ ట్రావెల్స్ బస్సుల వ్యవస్థపై అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. బస్సు ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఎమర్జెన్సీ ఎగ్జిట్ గేట్లు, ఫైర్ సెఫ్టీ పరికరాలు, డ్రైవర్ లైసెన్స్ వివరాలు తప్పకుండా పరిశీలిస్తే ఈ బస్సుల బాగోతం అంతా బయటపడుతుందని పలువురు పేర్కొంటున్నారు.

అధికారులు తనిఖీలు చేస్తున్నారంటే ముందస్తుగానే వీరికి సమాచారం అందుతుండటంతో పది కిలోమీటర్ల దూరంలోనే ఆపేసి తనిఖీలు కాగానే మళ్లీ బస్సులను తిరిగి యథావిధిగా నడిపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ బస్సులకు మంచిర్యాల, తాండూరు, కాగజ్‌నగర్ క్రాస్ రోడ్డు వద్ద హోటల్‌లో భోజన వసతి కల్పిస్తున్నారు. సికింద్రాబాద్ నుంచి ఛత్తీస్‌గడ్‌కు వెళ్లే సమయంలో ఎలాంటి ఇబ్బందులు వచ్చిన కూడా మంచిర్యాల నుంచి కాగజ్‌నగర్ వరకు కొంత మంది బ్రోకర్లను ఏర్పాటు చేసుకున్నారు. వీరి ద్వారా ఇక్కడి పరిస్థితులు ఎప్పటికప్పుడు చేరవేస్తు లక్షల్లో లాభాలు గడిస్తున్నారు. అలాగే ఈ బస్సులను నిబంధనలకు విరుద్ధంగా స్లీపర్ కోచ్‌లుగా మార్చి తయారు చేశారు.

కాగా సంబంధిత శాఖ అధికారులకు నెలావారీ మాముళ్లు ముట్టజెప్పుతున్నట్లు ఆరోపణలున్నాయి. దీంతోనే ఈ బస్సులను ఎవరు కూడా ఆపకుండా వదిలేస్తుండటం విమర్శలకు దారితీస్తోంది. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి ఈ బస్సులపై గట్టి నిఘా పెట్టి భద్రతా నిబంధనలు పాటించేలా, పక్కాగా చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

ప్రభుత్వ ఖజానాకు తీరని నష్టం..

నిబంధనలకు విరుద్ధంగా బస్సులను మార్చుచేసి ఇతర రాష్ట్రాలకు ప్రయాణికులను చేరవేస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది కూలీలు, వ్యాపారులు ఉండగా, కాగజ్‌నగర్ క్రాస్ రోడ్డు నుంచి దొడ్డిదారిన వెళుతున్నాయి. దీంతో రోడ్లు అనతికాలంలోనే పాడవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఫిట్‌నెస్ లేని బస్సులతో తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులోని పెన్‌గంగా మీదుగా దాటేస్తున్నారు. ఒక వైపు భారీ వాహనాలు, ట్రావెల్స్‌తో రాష్ట్ర సరిహద్దులోని వెంకట్రావ్‌పేట బ్రిడ్జి దెబ్బతింటోంది.

భద్రతా చర్యలు చేపట్టకుండా అతి వేగంగా రాత్రి వేళల్లో నడుపుతుండడం ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయిని నిపుణులు హెచ్చరిస్తు న్నారు. ఆసిఫాబాద్-వాంకిడి మీదుగా ఛత్తీస్ గడ్ వరకు వెళ్లే ఈ బస్సులు అడ్డదారి గుండా వెళుతున్నా తనిఖీలు చేపట్టాల్సిన అధికారులు నిద్రామత్తు వీడక పోవడం పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నిత్యం వందలాది బస్సులు నడుపుతూ ప్రజలు, ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నడిచే బస్సులతో పెను ప్రమాదాలు చోటు చేసుకోకముందే అధికారులు పటిష్టచర్యలు తీసుకోవాల్సి ఉంది.

రైలులో వదిలిపెట్టిన చిన్నారిని చేరదీసిన అధికారులు


చిన్నారితో బాలల సంరక్షణ అధికారులు

ఆసిఫాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నుంచి పాట్నాకు వెళ్తున్న దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో గుర్తు తెలియని తల్లి సుమారు రెండు నెలల చిన్నారిని వదిలి వెళ్లిపోయిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఈ ఘటనపై సహ ప్రయాణికులు వెంటనే కాగజ్‌నగర్ రైల్వే పో లీసులకు సమాచారం అందించారు. సమా చారం అందుకున్న వెంటనే రైల్వే పోలీసులు కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో పాపను తమ ఆధీనంలోకి తీసుకుని ఈ విషయం గురించి జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేష్‌కు సమాచారం అందించారు. అనంతరం అక్కడికి చేరుకున్న జిల్లా బాల ల సంరక్షణ విభాగం సిబ్బంది పాపను చేరదీసి ఆసిఫాబాద్‌లోని బాల రక్షాభ వన్ తరలించారు. జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్ ఆదేశాల మేరకు ఆ పాపను ఆది లాబాద్‌లోని శిశుగృహానికి తరలించారు. ఈ సందర్భంగా డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ పాపను చట్టబద్ధంగా శిశుగృహం ద్వారా దత్తత ఇస్తామని తెలిపారు. బాల రక్షాభవన్ సిబ్బంది శ్రావణ్‌కుమార్, జము న, చంద్రశేఖర్, బాల ప్రవీణ్, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా మూల మలుపులు

- హెచ్చరిక బోర్డులు కరువు


నంబాలలో ప్రమాదకరంగా మూలమలుపు

దండేపల్లి అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం గూడెం నుంచి మేదరిపేట రింగ్ రోడ్డు గ్రామంలోని పలుచోట్ల ఉన్న మూల మలుపులతో ప్రమాదం పొంచి ఉంది. ఈరింగ్ రోడ్డు గుండా నిత్యం బస్సు, కార్లు, ఆటోలు, ట్రాలీలు, ద్విచక్రవాహనాలపై ప్రజలు ప్రయాణం సాగిస్తుంటారు. దీంతో గూడెం, నంబాల, వెల్గనూర్, కాసిపేట, కొండాపూర్, ద్వారక, ధర్మరావుపేట పలుచోట్ల మూలమలుపులు ఉన్నప్పటికీ అధికారులు ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనదారులు ఆదమరిస్తే వాహనం నేరుగా మూల మలుపులో ఉన్న గుంతలో పడే అవకాశం ఉంటుంది. మూలమలుపు వద్ద వచ్చే పోయే వాహనాలు కనిపించకపోవడంతో అప్పుడప్పుడు ప్రమాదాలు జరిగి గాయాలైన సంఘటనలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి గూడెం-మేదరిపేట రింగ్ రోడ్డులో పలు గ్రామాల్లోని మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, రక్షణ గోడలు నిర్మించే విధంగా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.


గూడెం జీపీ కార్యాలయ సమీపంలో మూలమలుపు

కాగజ్‌నగర్‌లో ఛట్ పూజలు


ఛట్ పూజల్లో పాల్గొన్న మహిళలు

కాగజ్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్పీఎం ఛట్ కొలనులో సోమవారం ఛట్ పూజలు ప్రారంభమయ్యాయి. ఈ పూజల్లో ప్రధానంగా సూర్యదేవుడిని ప్రార్థిస్తారు. సూర్యాస్తమయం నుంచి సూర్యోదయం వరకు కఠోర ఉపవాస దీక్షను చేపట్టారు. ఛట్ పూజల సందర్భంగా ఎస్పీఎం యాజమాన్యం అన్నీ వసతులను కల్పించారు. సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు ఛట్ కొలనును సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరభారతీయులు, ఎస్పీఎం మిల్లు కార్మికులు, పట్టణ వాసులు పాల్గొన్నారు.

ప్లాంటేషన్ తనిఖీ

దహెగాం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం గిరివెల్లి బీట్‌పరిధిలోని చంద్రపల్లి ప్లాంటేషన్‌ను సీఎఫ్, ఎఫ్‌డీపీటీ కవ్వాల్ టైగర్ రిజర్వు శాంతారాం సోమవారం తనిఖీ చేశారు. ప్లాంటేషన్‌లోని మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్లాంటేన్‌లోకి పశువులు, మేకలు రాకుండా గ్రామాల్లో ప్రజలు, కాపర్లకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్లాంటేషన్‌లో గడ్డి, కలుపు మొక్కలు ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎలాంటి సమస్యలు ఎదురైనా తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ఆయన వెంట డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టిబ్రేవాల్, ఎఫ్‌డీవో దేవిదాస్, ఎఫ్ఆర్వోలు బాణేష్, ఎఫ్ఎస్‌వోలు సద్దాం హుస్సేన్, రవి, ఎఫ్‌బీవో అస్మా తదితరులు ఉన్నారు.

శ్రావణి కుటుంబానికి న్యాయం చేయాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఆసిఫాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలంలోని గొర్రె గ్రామానికి చెందిన ఆదివాసీకి చెందిన నిండు గర్భిణి తలండి శ్రావణి ఈనెల 18న కుల దురాహంకార హత్యకు బలైందని ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ శ్రావణితో పాటు కడుపులో ఉన్న పాప కూడా హత్యకు గురైందని నిందితులపై రెండు హత్యా కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి విచారణ వేగవంతం చేయాలన్నారు. శ్రావణి భర్త శేఖర్ పాత్ర ఉందని ఆయనను కూడా అరెస్టు చేయాలన్నారు. కలెక్టర్ వెంటనే గొర్రె గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబానికి 25 లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడా వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ దీపక్ తివారికి అందజేశారు. ప్రజా సంఘాల నాయకులు మాలాశ్రీ, అశోక్, శ్రీనివాస్, ఆనంద్, దినకర్, కార్తీక్, టికానంద్, పురుషోత్తం, నిఖిల్, శ్రీకాంత్, సాయి, వినోద, సాయి కృష్ణ, అనిత, రాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులు ఉత్పత్తి లక్ష్యాలపై దృష్టి పెట్టాలి

- ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు డైరెక్టర్ కె వెంకటేశ్వర్లు


కైరిగూడ ఓసీని పరిశీలిస్తున్న డైరెక్టర్ కె వెంకటేశ్వర్లు

రెబ్బెన, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అధికారులు ఉత్పత్తి లక్ష్యాలపై దృష్టి పెట్టాలని ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు డైరెక్టర్ కె వెంకటేశ్వర్లు సూచించారు. బెల్లంపల్లి సింగరేణి ఏరియాలో ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వర్లు జీఎం ఎం విజయభాస్కర్‌రెడ్డితో కలిసి పర్యటించారు. అనంతరం జీఎం కార్యాలయంలో అన్ని విభాగాల అధిపతులతో సమావేశం నిర్వహించి గోలేటి ఉపరితల గని పనుల ప్రగతిని సమీక్షించారు. వర్షాలు తగ్గుముఖం పట్టినందున ఉత్పత్తి లక్ష్యాలపై దృష్టి పెట్టాలన్నారు. నిత్యం 15వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలన్నారు. అనంతరం కైరిగూడ ఓసీ నుంచి పనిస్థలాలను తనిఖీ చేశారు. ఉత్పత్తిలో భాగస్వాములు అవుతున్న మహిళా ఉద్యోగులతో మాట్లాడారు. మగవారితో సమానంగా వారు చేస్తున్న పనులను చూసి అభినందించారు. బ్లాస్టింగ్ పనులు ఎలా చేస్తున్నారో ఉద్యోగులు డైరెక్టర్‌కు వివరించారు. ఇలాగే పనిచేస్తే పదోన్నతులు త్వరగా కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పీవో నరందర్, ఏరియా ఇంజనీర్ కృష్ణమూర్తి, ఎస్ఓటు జీఎం రాజమల్లు, మేనేజర్ శంకర్, తదితరులు ఉన్నారు.

దాడి ఘటనలో యువకుడి మృతి

మంచిర్యాల క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం గొల్లవాడకు చెందిన రవి రాజేశ్వర్ (40) అనే వ్యక్తి దాడి ఘటనలో సోమవారం మృతి చెందా రు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం రవి రాజేశ్వర్ అతని తమ్ముడు సూరజ్ మద్యం మత్తులో రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం గొడవకు పాల్పడ్డారు.

ఈ గొడవలో రవి రాజేశ్వర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతడిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రవి రాజేశ్వర్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

అవినీతిని నిర్మూలిస్తేనే దేశ పురోభివృద్ధి

- పారదర్శకతకు మరో పేరు సింగరేణి - ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు డైరెక్టర్ కె వెంకటేశ్వర్లు

రెబ్బెన, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అవినీతిని నిర్మూలిస్తేనే దేశ పురోభివృద్ధి సాధ్యమని, దేశంలోనే అత్యంత పారదర్శకత ఉన్న సంస్థ సింగరేణి అని ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు డైరెక్టర్ కె వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం గోలేటి జీఎం కార్యాలయం ఆవరణలో నిర్వహించిన విజిలెన్స్ వారోత్సవాల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై జీఎం విజయభాస్కర్‌రెడ్డితో కలిసి గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుతం సాంకేతిక పెరిగిపోయిందని ఎదుటి వారితో మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. అవినీతి ఏ రంగంలో అయినా అభివృద్ధికి అడ్డంకిగా మారుతుందని ఫలితం దేశ పురోభివృద్ధిపై ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. అవినీతి లేకుంటే సమాజం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని అన్నారు. అనంతరం అవినీతికి వ్యతిరేకంగా నిజాయితీగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు కిరణ్, డీజీఎం ఉజ్వల్‌కుమార్ బెహారా, ఏరియా ఇంజనీర్ కృష్ణమూర్తి, ఎస్‌వోటు జీఎం రాజమల్లు, పర్సనల్ హెచ్‌వోడీ శ్రీనివాస్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

● అవినీతి లేని సింగరేణియే లక్ష్యం ..

మందమర్రిటౌన్: సింగరేణిని అవినీతి రహిత సంస్థగా తీర్చిదిద్దడానికి ప్రతీఒక్కరు ముందుకు సాగాలని మందమర్రి జీఎం రాధాకృష్ణ పేర్కొన్నారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా సోమవారం జీఎం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశానికి వెలుగునిస్తున్న సింగరేణి ఉద్యోగులు ఎలాంటి పనులకు డబ్బులు ఇవ్వకూడదని తెలిపారు. ప్రతీఒక్కరు వారి విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు. అనంతరం విజిలెన్స్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం విజయ్‌ప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సత్యనారాయణ, పీఎం శ్యాంసుందర్, అధికారుల సంఘం జాయింట్‌సెక్రటరీ రవి, సీనియర్‌పీవో సత్యనారాయణ పాల్గొన్నారు.

అవినీతికి వ్యతిరేకంగా ప్రతినబూనాలి..

శ్రీరాంపూర్: అవినీతికి వ్యతిరేకంగా ప్రతినబూనాలని ఏరియా ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ కుర్మ రాజేందర్ అన్నారు. విజిలెన్స్ వారోత్సవాలను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అవినీతి రహిత దేశం-అభివృద్ధి చెందిన దేశం అనే నినాదంతో ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు జి వెంకటేశ్వర్ రెడ్డి, ఏజీఎం(ఫైనాన్స్) టీబత్స, డీజీఎం(పర్సనల్) అనిల్‌కుమార్, డీజీఎం(ఐఈడీ) రాజన్న, డీజీఎం (సివిల్) ఆనంద్‌కుమార్, డీజీఎం (ఫారెస్ట్) హరినారాయణ, ఎస్ఈ (పర్చేజ్) టింబర్ ఇన్‌చార్జి రాజేశ్వరరావు, పాల్గొన్నారు.

అవినీతిని నిర్మూలించాలి..

జైపూర్: అవినీతిని నిర్మూలిస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందని ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం నరసింహారావు పేర్కొన్నారు. సోమవారం ఎస్టీపీపీలోని పరిపాలన భవనంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ దేశమైనా అభివృద్ధిలో ముందంజలో ఉండాలంటే ఆ దేశంలో అవినతి ఉండకూడదన్నారు. ప్రతీ ఒక్కరు అవినీతి నిర్మూలన కోసం కృషి చేయాలన్నారు. సంస్థలోని ప్రతి ఉద్యోగి న్యాయంగా, నిజాయితీగా ఉండాలన్నారు. విజిలెన్స్ విభాగాధిపతి రామబ్రహ్మం మాట్లాడుతూ సంస్థలోని ప్రతి ఒక్కరు వారి కార్యకలాపాల్లో నిజాయితీగా అంకితభావంతో పనిచేస్తూ ఏదైనా అవకతవకలు జరిగితే గుర్తించి విజిలెన్స్ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా సంస్థ ఆస్తుల పరిరక్షణకు చర్యలు, డిజిటల్ టెక్నాలజీని ఉపయోగించే కార్యక్రమం తదితర వాటి గురించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. అనంతరం విజిలెన్స్ పోస్టర్లను, కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు మదన్ మోహన్, సత్యనారాయణ, సంతోష్‌కుమార్, అజాజుల్లాఖాన్, వేణుగోపాల్, పంతుల, కిరణ్‌బాబు, ఓదెలు, శ్రీహరి పాల్గొన్నారు.


శ్రీరాంపూర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు





గోలేటిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు డైరెక్టర్ కె వెంకటేశ్వర్లు, మందమర్రిలో మాట్లాడుతున్న జీఎం రాధాకృష్ణ

అవినీతి రహిత సింగరేణిగా తీర్చిదిద్దాలి..

కాసిపేట: సింగరేణిలో అవినీతిని రూపుమాపి అవినీతి రహిత సింగరేణిగా తీర్చిదిద్దాలని కాసిపేట గని మేనేజర్ సతీష్ అన్నారు. సోమవారం సింగరేణి విజిలెన్స్ కార్యక్రమంలో భాగంగా కాసిపేట గనిపై కార్మికులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థలో పనిచేసే ప్రతి ఒక్కరు అవినీతిని నిర్మూలించాలని సూచించారు. అనంతరం కార్మికులందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బెల్లంపల్లిబ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, ఎస్‌వో నిఖిల్ అయ్యర్, అధికారులు హిమాలయ, మురళీ, సురేష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొనాలి

శ్రీరాంపూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెలలో నిర్వహించనున్న డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొనాలని రిటైర్డ్ కార్మికులకు సింగరేణి పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం రమాకాంత్ ఒక ప్రకటనలో కోరారు. ప్రతి రిటైర్ ఉద్యోగి లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుందన్నారు. లేనిపక్షంలో పెన్షన్ అందే అవకాశం ఉండదన్నారు. దేశవ్యాప్తంగా రెండు వేల కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రభుత్వమే స్పెషల్ డ్రైవ్ ద్వారా సర్టిఫికెట్లు అందిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 3వ తేదీ నుంచి 28వ తేదీ వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. నవంబరు 3, 4న రామగుండం-1 డివిజన్‌లో, 6, 7న రామగుండం-3 డివిజన్‌లో, 10, 11న రామగుండం-4 డివిజన్‌లో, హైదరాబాద్, శ్రీరాంపూర్‌లో 12, 13తేదీల్లో, మందమర్రిలో 17, 18న, బెల్లంపల్లిలో 19, 20న, భూపాలపల్లిలో 24, 25లో, వకీల్‌పల్లిలో 26, గోదావరిఖని సీఎంపీఎఫ్ కార్యాలయంలో 3 నుంచి 28వ తేదీ వరకు శిబిరాలు కొనసాగుతాయన్నారు. పెన్షన్ పొందుతున్న వారు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు. పీపీవో లెటర్, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, సెల్‌ఫోన్ వెంట తీసుకొని రావాలని సూచించారు.

కార్మికుల వాహనాల కోసం షెడ్డు నిర్మాణం

మందమర్రిటౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వర్క్‌షాపు ఉద్యోగుల వాహనాల సౌకర్యం కోసం షెడ్డు నిర్మాణం చేపడుతున్నామని ఏరియా వర్క్‌షాపు డీవైజీఎం దూప్‌సింగ్ తెలిపారు. సోమవారం ఏరియా వర్క్‌షాపు సమీపంలో వాహన షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ వాహనషెడ్డు లేకపోవడం వల్ల కార్మికులు ఎదుర్కొంటున్న వాహన సమస్యను గుర్తింపు సంఘం నాయకులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. జీఎం ఆదేశాల మేరకు షెడ్డును నిర్మిస్తున్నామన్నారు. ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి బీమనాధుని సుదర్శన్, అధికారులు సత్యగౌడ్, సదానందం, శ్రీనివాస్, పిట్ కార్యదర్శి శర్మ, ముల్కలపల్లి వెంకటేశ్వర్లు, తోట వెంకటస్వామి, రాజేశ్వర్‌రావు, రాజేశం పాల్గొన్నారు.

విద్యుత్ సెక్షన్ కార్యాలయం ఏర్పాటు

భీమిని, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : భీమిని మండల కేంద్రంలో నూతనంగా సోమవారం విద్యుత్ సెక్షన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు ట్రాన్స్‌కో ఏఈ రాజనర్సు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ గ్రామంలోని సెక్షన్ కార్యాలయాన్ని భీమిని మండల కేంద్రానికి మార్చినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరా తదితర సమస్యలను త్వరగా పరిష్కరిస్తామన్నారు.

బుగ్గ రాజన్న ఆలయంలో భక్తుల సందడి

బెల్లంపల్లి, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలో శ్రీబుగ్గ రాజరాజేశ్వరి స్వామి దేవాలయంలో శ్రావణ సోమవారం నేపథ్యంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. దేవాలయంలోని శివలింగానికి అభిషేకాలు చేశారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భజనలు, కీర్తనలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. భక్తులకు అన్న ప్రసాదాలు అందజేశారు. అలాగే కార్తీక వన భోజనాలకు ఎక్కువ భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఆలయంలో శివలింగానికి ఆలయ అర్చకులు సతీష్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ద్వారకాపూర్‌లో ఎంపీవో పర్యటన

తాండూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ద్వారకపూర్ గ్రామ పంచాయతీలో సోమవారం ఎంపీవో అనిల్‌కుమార్ పర్యటించారు. పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్రతి రోజు పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలని, రోడ్లపై చెత్తా, చెదారం లేకుండా చూడాలన్నారు. అనంతరం పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఎప్పటికప్పుడు రికార్డులను అప్‌డేట్ చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

నేడు పత్తి రైతులతో సమావేశం

మందమర్రిరూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పత్తి రైతులతో మంగళవారం సండ్రోన్‌పల్లిలోని రైతు వేదికలో ఉదయం 9 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారిణి కిరణ్మయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పత్తిని అమ్మడం, తదితర వాటిపై అవగాహన కల్పిస్తామన్నారు. పత్తి రైతులందరు హాజరు కావాలన్నారు.



సూరారం గ్రామంలో గులాబీ తోట

సీజన్‌లో డిమాండ్ ఎక్కువే..

ఇళ్లలో ఏ శుభకార్యాలు జరిగినా పూలతోనే అవసరం. వీరు పండించే పూలు మంచిర్యాలతో పాటు కరీంనగర్, హైదరాబాద్‌కు అమ్ముతుంటారు. గులాబీ, లిల్లీ పూలు కిలోకు రూ. 120 నుంచి 150 వరకు ధర పలుకుతుంది. సీజన్‌లో డిమాండ్‌ను బట్టి 200 కూడా వచ్చే అవకాశం ఉంది. పెద్ద మొత్తంలో ఆర్డర్లు తీసుకుని పూలను సప్లై చేస్తున్నారు.

అధికారుల సూచన మేరకు ఫెస్టిసైడ్స్..

పంటలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ రోజుకు ఒక సారి తప్పకుండా నీరు పెట్టాలి. పూల తోటల సాగు చేస్తే ఉద్యానశాఖ అధికారుల పర్యవేక్షణ ఉండాలి. పంటలకు ఏదైన పురుగు పట్టినట్లు అనిపిస్తే వెంటనే అధికారుల సూచన మేరకు ఫెస్టీసైడ్స్ వాడాల్సి ఉంటుంది. ఫెస్టీసైడ్స్ విషయంలో అంతపెద్ద ఖర్చు ఏమీ ఉండదు.

ఉద్యాన పంటలపై చూపు

● సూరారంలో గులాబీ, లిల్లి తోటల పెంపకం ● లాభాలు గడిస్తున్న యువ రైతులు

లక్షెట్టిపేట, అక్టోబరు, 27 (ఆంధ్రజ్యోతి): వరి, పత్తి పంటలు అన్నదాతలు సహజంగా పండించే పంటలు. పెట్టుబడులు పెట్టడం, ప్రకృతి వైపరీత్యాల వల్ల తీవ్ర నష్టాలు చవిచూడటం సర్వసాధారణం. అయితే లక్షెట్టిపేట మండలం సూరారం గ్రామ యువరైతులు కాస్త భిన్నంగా ఆలోచించారు. రొటీన్ పంటలు కాకుండా మార్కెట్లో ఎక్కువ డిమాండ్ ఉన్న ఉద్యాన పంటలపై అడుగులు వేశారు. పెట్టిన పెట్టుబడికి రెండింతలు లాభాలు వచ్చేలా కొత్త తరహా పంటలు పండిస్తున్నారు.

ఒకప్పుడు ఇదే గ్రామం మల్లెపూల సాగుకు పెట్టింది పేరు. ఇప్పుడు అదే తరహాలో గ్రామానికి చెందిన నాగిరెడ్డి హేమంత్‌రెడ్డి, గుర్తింతి రాజు, కోడూరి ప్రశాంత్ అనే ముగ్గురు స్నేహితులు పూల తోట సాగుపై దృష్టి పెట్టారు. ప్రస్తుతం వాళ్లకు ఉన్న స్వంత భూమిలో ఉద్యాన పంటలైన గులాబీ, లిల్లీ పూల సాగును ఎంచుకున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే విధంగా పంటల సాగులో దూసుకుపోతున్నారు.

ఎకరానికి రూ. 2లక్షల ఖర్చు..

గులాబీ తోట సాగు చేయాలంటే ఎకరాకు రెండు లక్షల రూపాయల వరకు ఖర్చు వస్తుందని అంటున్నారు రైతులు. పంట చేతికి వచ్చిన తర్వాత కూడా సం వత్సరం పాటు పూలు పూస్తూనే ఉంటాయని చెబుతున్నారు. ఎకరం పంటపై పెట్టిన పెట్టుబడికి నెలకు సుమారు 50వేలకు పైగానే ఆదాయం వస్తుంది. కానీ పంట సాగు చేసే సమయంలో మొదట 6 నెలలు మొక్కలను శ్రద్ధగా చూసుకోవాలని 6 నెలల పాటు వచ్చిన మొగ్గను తెంపి చెట్టు ఎదుగుదలపై దృష్టి పెట్టాలని ఆ తర్వాత వచ్చే పూలు పెద్ద సైజులో ఉండటంతో పాటు మంచి ధర కూడా వస్తుందంటు న్నారు రైతులు. ఇక లిల్లీ తోటకు ఎక్కువ పెట్టుబడి ఉండదని ఎకరాలో సాగు చేస్తే సుమారు లక్ష రూపాయల పెట్టుబడి మాత్రమే సరిపోతుందంటున్నారు.



లిల్లి పూల తోట

ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వాలి..

నాగిరెడ్డి హేమంత్ రెడ్డి, రైతు



నేను కరీంనగర్‌లో ఉండే మా అక్కను ఆదర్శంగా తీసుకుని గులాబీ, లిల్లీ పూల తోటల సాగు చేస్తున్న. ప్రస్తు తం మన ప్రాంతం భూములు ఉద్యాన పంటలకు మంచి లాభదాయంగా ఉన్నాయి. కానీ ప్రభుత్వం నుంచి సబ్సిడీ లేక ఇబ్బంది అవుతోంది. పక్క జిల్లాలో పూల తోటల సాగుకు ప్రభుత్వం సబ్సిడీలపై పనిముట్లను అందజేస్తుంది. మన జిల్లాలో ఎవరూ సాగు చేయడం లేదని సబ్సిడీలు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం సబ్సిడీలు అందజేస్తే సాగు ఇంకా పెంచాలనే ఆలోచన ఉంది. అంతే కాకుండా గ్రామంలో చాలా మంది రైతులు ఉద్యాన పంటలవైపే ఎక్కువగా ఆసక్తి చూపుతారు.

ఈ ఏడాది సబ్సిడీలు అందజేస్తాం...

కందుల సహజ, ఉద్యానవన శాఖ అధికారి లక్షెట్టిపేట



ఉద్యాన పంటలపై రైతులు దృష్టిపెడితే మంచి లాభాలు పొందుతారు. ఇప్పుడు రైతులు పూల తోటల సాగు ఎక్కువగా చేస్తున్నారు. గతంలో పూలతోటల సాగు లేక మన జిల్లాకు పూలతోటలపై సబ్సిడీలు ప్రభుత్వం అందించలేదు. గతేడాది కేవలం మల్చింగ్ షీట్‌కు మాత్రమే ఇచ్చాం. పూలతోటల సాగులో కూడా మంచి లాభాలు పొందవచ్చు గనుక ఈ ఏడాది నుంచి మల్చింగ్ షీట్‌తో పాటు డ్రిప్‌కు అలాగే మొక్కలు పెట్టినందుకు కూడా సబ్సిడీలు అందుబాటులో ఉన్నాయి. సాగు చేసే రైతులు ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకుంటే సబ్సిడీలు తప్పకుండా వర్తిస్తాయి.

బండి సంజయ్‌ను కలిసిన మధుకర్ కుటుంబ సభ్యులు



బండి సంజయ్‌తో మధుకర్ కుటుంబీకులు, బీజేపీ నాయకులు

వేమనపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : వేమనపల్లి బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్ కుటుంబ సభ్యులు సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కలిశారు. కాంగ్రెస్ నాయకుల వేధింపులతో మధుకర్ ఆత్మహత్య చేసుకున్న తెలిసిందే. ఈ నేపథ్యంలో బండి సంజయ్‌ను మధుకర్ కుటుంబ సభ్యులు, స్థానిక బీజేపీ నాయకులు కలిశారు. బండి సంజయ్ మాట్లాడుతూ బీజేపీ అండగా ఉంటుందని, అధైర్యపడవద్దని సూచించారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. మధుకర్ ఆత్మహత్యకు కారణమైన వారికి తప్పకుండా శిక్ష పడుతుందని తెలిపారు. వారి వెంట బీజేపీ జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, వేమనపల్లి మండల నాయకులు వెంకటేశ్వర్, అజయ్‌కుమార్, సత్యనారాయణ, మధునయ్య, వెంకాగౌడ్, పోచయ్య, భీమయ్య, లస్మయ్య, బుచ్చయ్య, అనిల్, తిరుపతి, రవికుమార్, వెంకటేష్, మధుకర్‌కుటుంబ సభ్యులు ఉన్నారు.

వాలీబాల్ పోటీల్లో రాణించిన క్రీడాకారులు

బెల్లంపల్లి, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): అండర్-19 ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు క్రీడాకారులు కాంస్య పతకం కైవసం చేసుకున్నట్లు ఎస్‌జీఎఫ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి బి. బాపురావు తెలిపారు. రాష్ట్ర వాలీబాల్ పోటీల్లో క్రీడాకారుల మధ్య తీవ్ర పోటి ఉన్నప్పటికీ పోటీల్లో రాణించి కాంస్య పతకం గెలుచుకోవడం గొప్ప విషయమన్నారు. కాంస్య పతకం సాధించిన క్రీడాకారులను అభినందించారు. ఈ క్యాక్రమంలో కాసిపేట గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్, టోర్నమెంట్ కోచ్ హరీశ్, వ్యాయమ ఉపాధ్యాయులు అల్లూరి వామన్, రాజేందర్‌లు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి

జైపూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు సికిందర్ పేర్కొన్నారు. సోమవారం జైపూర్‌లోని ప్రభుత్వ కళాశాల ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రావాల్సిన ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు రూ. 7200 కోట్లు పెండింగ్‌లో ఉండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫీజులు కట్టాలని ప్రైవేటు కళాశాలల యాజమానులు విద్యార్థులను వేధిస్తున్నారన్నారు. వెంటనే వీటిని విడుదల చేయాలని కోరారు. అలాగే జైపూర్ ప్రభుత్వం కళాశాల చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడంతో మహిళ విద్యార్థినీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ప్రహరీ గోడ నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంశీ, రవితేజ, అన్వేష్, సుమంత్, వైష్ణవి, రోజా, మేఘన, విద్యార్థులు పాల్గొన్నారు.

డీసీసీ పీఠం బీసీలకు దక్కేనా...?

(5వ పేజీ తరువాయి)

మొత్తం 29 మంది ఆశావహులు దరఖాస్తు చేస్తుకున్నారు. దరఖాస్తు దారుల్లో సీనియర్లు, గతంలో వివిధ పదవులను అలంకరించిన వారితోపాటు కొత్తవారు కూడా ఉన్నారు. వీరిలో బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకులు పది మంది వరకు ఉన్నారు. జిల్లాలో బీసీ సామాజిక వర్గానికి చెందిన జనాభానే అధికంగా ఉంది.

డీసీసీ పదవి భర్తీలో సామాజిక న్యాయం పాటిస్తామని ఏఐసీసీ, పీసీసీ కూడా ప్రకటించి నందున బీసీ సామాజిక వర్గానికి చెందిన వారంతా ఆ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలోని మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి సెగ్మెంట్ల పరిధిలో డీసీసీ పదవి కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో మంచిర్యాల నియోజక వర్గం నుంచి బీసీ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నాయకులు డాక్టర్ నీలకంఠేశ్వర్ గౌడ్ (కాంగ్రెస్ సేవాదల్ స్టేట్ జనరల్ సెక్రెటరీ), ముత్తినేని రవికుమార్ (ఏఐసీసీ స్టేట్ కో ఆర్డినేటర్), వంగల దయానంద్, గడ్డం త్రిమూర్తి, నరేంధర్ నాయుడు ఉండగా, బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి సీనియర్లు కారుకూరి రాంచందర్, మత్తమారి సూరిబాబు, బండి ప్రభాకర్, తొంగల మల్లేష్, ఎండీ అఫ్జల్ ఉన్నారు. బీసీ నాయకుల్లో సమర్థవంతమైన వారికి డీసీసీ పదవి దక్కే అవకాశాలు ఉండగా, పార్టీ వైఖరిలో మార్పులు సంభవిస్తే మాత్రం బీసీలతో పాటు ఓసీ, ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన సీనియర్లు, పార్టీని ఏకతాటిపై నడిపగల వ్యక్తికి డీసీసీ పీఠం దక్కే అవకాశాలు ఉన్నాయి.

రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

నెన్నెల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలతో పంటలు నష్ట పోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి డిమాండ్ చేశారు. సంఘం నాయకులతో కలిసి సోమవారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ మండలంలో అకాల వర్షాలతో పత్తి చేలు, వరి పొలాలు దెబ్బతిన్నాయన్నారు. వర్షంతో తడిసిన పత్తి, ధాన్యాన్ని ఎలాంటి ఆంక్షలు విధించకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. పత్తిలో తేమ పేరిట ధరల్లో కోతలు విధించేందుకు సీసీఐ కొత్త నిబంధనలు తెస్తుందన్నారు. వెంటనే ధాన్యం కొనుగోలు సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోళ్లలో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. నాయకులు దుగుటరెడ్డి, చంద్రయ్య, మల్లేష్, రాయలింగు, శ్రీనివాస్, మల్లయ్య పాల్గొన్నారు.

లక్షెట్టి పేట: రైతులు పండించిన పత్తికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ సోమవారం లక్షెట్టిపేట ఎమ్మార్వో కార్యాలయంలో అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు తహసీల్దార్ దిలీప్ కుమార్‌కు వినతిపత్రం అందజేసారు. పత్తికి గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని అంతే కాకుండా అకాల వర్షాలకు పత్తి నల్లబడుతుందని, పత్తికి గిట్టుబాటు ధర కల్పిస్తూ నల్లపత్తిని కూడా ప్రభుత్వం నిబంధనలు లేకుండా కొనుగోలు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు మండలంలోని రైతులు నష్ట పోతున్నారని నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

ఈకార్యక్రమంలో ఏఐకె ఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు శంకరి సత్యం, సాగర్, రవి పాల్గొన్నారు.

పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివి



బెల్లంపల్లిలో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న పోలీసులు

బెల్లంపల్లి, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివని వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులు చదువుకునే వయస్సులో చెడు వ్యసనాలకు బానిస కాకుండా బంగారు భవిష్యత్తుపై దృష్టి సారించాలన్నారు. విద్యార్థి వయస్సులో కష్టపడి చదివితే భవిష్యత్‌లో మంచి ఉద్యోగాలు సాధించి జీవితంలో స్థిరపడవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆవునూరి అంజయ్య, పోలీసు సిబ్బంది అధ్యాపకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక దీపారాధన పూజలు



శివుడికి అభిషేకం చేస్తున్న భక్తులు



సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

దండేపల్లి అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మొదటి సోమవారం పురస్కరించుకుని దండేపల్లిలో స్థానిక పద్మశాలి భవనం వద్ద భక్త మార్కెండేయస్వామి ఆలయంలో శివుడికి భక్తిశ్రద్ధలతో పూజలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు కుటుంబసమేతంగా శివుడికి పంచామృతాభిషేకాల, కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. అనంతరం శివుడి, మార్కండేయస్వామి దర్శించుకున్నారు.

గూడెంలో భక్తుల కార్తీక శోభ

గూడెం శ్రీసత్యనారాయణ స్వామి దేవాలయంలో కార్తీక శోభతో భక్తుల సందడి నెలకొంది. సోమవారం ఉదయం నుంచే గూడెంకు భక్తులు కుటుంబసమేతంగా తరలివచ్చి ఆలయ సమీపంలో గల పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ప్రత్యేక పూజలు చేసి, గోదావరి నదిలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయానికి చేరుకొని భక్తులు సత్యదేవున్ని దర్శించుకున్నారు. వందలాది మంది భక్తులు కు టుంబ సమేతంగా శ్రీసత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలను నోముకున్నారు. ఆలయ ప్రాంగణంలో ధ్వజాస్తంభం, రావిచెట్టు, ప్రధాన ఆలయం ఎదుట మహిళలు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. దీంతో గూడెం గుట్టు పరిసర ప్రాంతమంతా భక్తులతో కార్తీక సందడి నెలకొంది.

రాష్ట్ర వాలీబాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కాసిపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : అండర్ 19 స్కూల్‌గేమ్స్‌ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో కాసిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారని ప్రిన్సిపల్ శంకర్ తెలిపారు. ఈ నెల 24 నుంచి 26 వరకు భువనగిరిలో జరిగిన 69వ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ఇంటర్ విద్యార్థులు అభినయ్, కార్తీక్‌లు అన్ని విభాగాల్లో మెరుగైన ప్రతిభ కనబర్చి ఉమ్మడి జిల్లాను మూడవ స్థానంలో నిలిపారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపల్‌శంకర్, పీడీ బాబురావు, అధ్యాపకులు అభినందించారు.

నియామకం

మంచిర్యాల క్రైం, అక్టోబరు, 27 (ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ మంచిర్యాల కార్పొరేషన్ అధ్యక్షుడిగా పెంట మహేందర్‌ను ఎన్నుకున్నారు. కరీంనగర్ జోనల్ సమావేశంలో నూతన అధ్యక్షుడిగా ఆయన నియమితులయ్యారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో మహేందర్ ఏబీవీపీ కార్యదర్శిగా పని చేశారు. ఏబీవీపీ నగర అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు పెంట మహేందర్, విద్యార్థి పరిషత్ నాయకులు, మిత్రులు శెట్టి శ్రీనివాస్, పూరేళ్ల లక్ష్మణ్, పూరేళ్ల శ్రీనివాస్, తదితరులు అభినందించారు.

గిరిజన సంస్కృతిని సంరక్షించాలి



వినతి పత్రం అందిస్తున్న గిరిజన సంఘాల నాయకులు

కాసిపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : గిరిజన సంస్కృతి, దేవతలు, దేవస్థానాలను సంరక్షించాలని కోరుతూ సోమవారం గోండు ధర్మ గురు పాహండీ కూపర్ లింగు మఠం ఆధ్వర్యంలో గిరిజన సంఘాల నాయకులు మండల తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో అధికారులకు వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా కో యపున్నం రాయిసభ అధ్యక్షుడు పెంద్రం హన్మంతు మాట్లాడుతూ గోండుల ఆచార వ్యవహారాలకు, సంస్కృతి సంప్రదాయాలు హిందూ సంప్రదాయానికి భిన్నంగా ఉంటాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందన్నారు. గిరిజన సంస్కృతి దేవతామూర్తులు, దేవాలయాలు నిరాదరణకు గురవుతున్నాయన్నారు. రానున్న రోజుల్లో ఇవి కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు.

మధ్యప్రదేశ్ ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ ద్వారా ప్రత్యేక నిధులు విడుదల చేసి గిరిజన సంస్కృతి, దేవాలయాల రక్షణకు, గిరిజనుల సంక్షేమానికి కృషి చేస్తుందని, అలాగే తెలంగాణ రాష్ట్రంలో కూడా ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.

ఈకార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు ఆడె జంగు, సిడాం జంగు, సిడాం గణపతి, ప్రభాకర్, జైతు, గణపతి, జంగు, రమేష్, నూరు, వినయ్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ బహుజన సమాజ్‌తోనే సాధ్యం

నవంబర్ 1న మహా ధర్నా విజయవంతం చేయాలి

మంచిర్యాల క్రైం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్ బహుజన సమాజ్ పార్టీతోనే సాధ్యమని పార్టీ రాష్ట్ర నాయకులు కాదాసి రవిందర్, జిల్లా అద్యక్షులు ముల్కల్ల రాజేంద్ర ప్రసాద్‌లు అన్నారు. నవంబర్ 1న ఇందిరా పార్కు వద్ద నిర్వహించే విశాల మహా ధర్నాను విజయవంతం చేయాల న్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 42 శాతం బీసీ రిజర్వేషన్ బహు జన సమాజ్ పార్టీతోనే సాధ్యమన్నారు. రిజర్వేషన్ల సాధన కోసం ఇందిరా పార్కు వద్ద నిర్వహించే ధర్నాకు మంచిర్యాల జిల్లా నుంచి అధిక సంఖ్యలో బీసీలు తరలి రావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో నాయకులు కిరణ్ బాబు, బూడిద మల్లేష్, కృష్ణ చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ బెటాలియన్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

హాజీపూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకొని గుడిపేట్ 13వ బెటాలియన్ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. కమాండెంట్ రాములు ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో 200 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. గుడిపేట్ బెటాలియన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా వరకు కొనసాగింది. అమరవీరులకు జోహార్లు చెబుతూ ఈ ర్యాలీ కొనసాగించారు.

లక్షెట్టి పేట: పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా లక్షెట్టిపేట పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీ పట్టణంలోని గాంధీ చౌక్‌లో ప్రారంభమై స్థానిక ఊత్కూర్ చౌరస్తా వరకు కొనసాగింది. ఈసందర్భంగా పట్టణ ఎస్సై గోపతి సురేష్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసుల ఆత్మశాంతి కోసం ప్రతీ ఏటా అమర వీరుల సంక్షరణ వేడుకలు నిర్వహిస్తామని అసువులు బాసిన వారి ఆత్మలకు శాంతి కలగాలని ఈ సందర్భంగా కోరారు. ఈకార్యక్రమంలో ఎఎస్సై అన్సర్, హెచ్‌సీలు సాంబయ్య, సుభాష్, శంకరయ్యతో పాటు పోలీసు సిబ్బంది, పట్టణానికి చెందిన పలు స్వచ్ఛంద సంస్థల పాల్గొన్నారు.



గుడిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

ఆటో డ్రైవర్లకు గ్రీన్‌మ్యాట్ అందజేత

శ్రీరాంపూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్, క్రిష్ణకాలనీ ఆటో పాయింట్ల వద్ద డ్రైవర్లు, ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ ట్రస్ట్ ద్వారా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ద్వారా గ్రీన్‌మ్యాట్ అందించారు. ఆటో డ్రైవర్లు, ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని వివేక్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు బరపటి మారుతి దృష్టికి తీసుకురావడంతో ఆయన ఎంపీకి పరిస్థితిని వివరించి సమస్య పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో కృష్ణకాలనీ అధ్యక్షుడు రాగిడి రాజు, సీసీసీ అధ్యక్షుడు ఆవుల సుధాకర్, పాల్గొన్నారు.

పరీక్ష ఫీజు తేదీని పొడిగించాలి

లక్షెట్టిపేట, అక్టోబరు, 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం డిగ్రీ చదువుతున్న విద్యార్థుల పరీక్ష ఫీజు తేదీని పొడిగించాలని ప్రగతిశీల ప్రజాసామ్య విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేసారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందు నిరసన వ్యక్తం చేసారు. ఈసందర్భంగా పీడీ ఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీకాంత్ మాట్లాడుతూ కాకతీయ అనుబంధ విద్యార్థుల పరీక్ష ఫీజు ఈనెల 27తో ముగుస్తుందని ఇప్పటి వరకు కొంత మంది ఫీజు చెల్లించ లేదన్నారు. ఫీజు గడువు ముగియడంతో పేద విద్యార్థులు చదువుకు దూరం కావాల్సి వస్తుందని ప్రభుత్వం దీనిని దృష్టిలో ఉంచుకుని పరీక్ష ఫీజుతేదీని పెంచాలని డిమాండ్ చేసారు. ఈకార్యక్రమంలో పీడీఎస్ యూ నాయకులు కార్తీక్, అజయ్, ఆంజనేయులు, విజయ్, జశ్వంత్ పాల్గొన్నారు.

హిందూ సమాజాన్ని కాపాడుకోవాలి



మాట్లాడుతున్న దక్షిణామూర్తి

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : హిందూ సమాజాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ప్రాంత కార్యకారిణి సభ్యుడు దక్షిణామూర్తి, ప్రొఫెసర్ ఆనంద్ జకోటియా, నగర కార్యవాహకులు పర్వతాల నర్సయ్య, పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ సమాజంలో ఆర్ఎస్ఎస్‌తో సంఘటిత శక్తిని ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందని, హక్కుల సాధన, మానవ పరివర్తన, సమాసమాజ నిర్మాణం ఆర్ఎస్ఎస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. దేశం పట్లప్రేమ, భక్తి భావనలను పెంపొందించుకుని మాతృభాషలపై మక్కువ చూపించే విధంగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సభ్యులు, హిందూ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు రాజ్‌కిరణ్ పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

దండేపల్లి, అక్టోబరు, 27(ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండల కేంద్రంతో పాటు మండలంలోని రంగంపల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేసారు. ఈశిబిరాల్లో పశువులకు గాలికుంట వ్యాదుల నివారణ కోసం టీకాలు వేసారు. అనంతరం వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాడి రైతులకు అధికారులు వివరించారు. ఈకార్యక్రమంలో పశువైద్యాధికారి ధనరాజ్, సిబ్బంది స్వప్న, ఇందిర, అంజుం, సత్తయ్య, ప్రభు, కుమార్, వంశీతో పాటు పాడి రైతులు పాల్గొన్నారు.



డీసీసీ పీఠం బీసీలకు దక్కేనా?

బీసీలకే డీసీసీ పదవి దక్కుతుందా...!

ఢిల్లీలో కేసీ వేణుగోపాల్ నాయకత్వంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీసీసీ అధ్యక్షుల భర్తీలో సామాజిక న్యాయం పాటించాలనే సమాలోనలు బీసీలకే పద వి దక్కుతుందనే వాదానికి బలం చేకూరుస్తోంది. ఈ సందర్భంగా అన్ని వర్గాలకు తగిన అవకాశం ఇవ్వాలనే ఆలోచనకు పార్టీ వచ్చినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో రాష్ట్ర నాయకత్వంతో సమావేశమైన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ఓసీ, బీసీ, ఎస్సీ, మహిళల కేటగరీల్లో బల మైన నేతలు ఎవరున్నారని ఆరా తీసినట్లు సమాచారం. మరోవైపు సామాజిక న్యాయం కాంగ్రెస్ లక్ష్యమ ని రాహుల్ గాంధీ కూడా ప్రకటించిన నేపథ్యంలో ఈసారి జనాభా దామాషానా డీసీసీ అధ్యక్ష పదవిని భర్తీ చేస్తారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

- బీసీ రిజర్వేషన్ల నేపథ్యంలో వారికే ఇస్తారనే చర్చ
- బలం చేకూరుస్తున్న పీసీసీ అధ్యక్షుడి వ్యాఖ్యలు
- దరఖాస్తుదారుల్లో పలువురు బీసీ నాయకులు

మంచిర్యాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవిపై రోజు రోజుకూ అంచనాలు తారుమారు అవుతున్నాయి. ఊహకందని విధంగా ఏఐసీసీ అధిష్టానం డీసీసీ పదవుల భర్తీ చేపట్టనుండటంతో అసలు పదవి ఎవరికి వరిస్తుందోనన్న చర్చ జిల్లాలో జోరుగా సాగుతోంది. డీసీసీ పదవి కోసం ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ఏఐసీసీ పరిశీల కులు సురేష్‌కుమార్ ఈ నెల 16 నుంచి 19 వరకు మూడు రోజుల పాటు జిల్లాలో పర్యటించారు. జిల్లాలోని మూడు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో పర్యటించిన ఆయన ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తులు ఇప్పటికే ఢిల్లీలోని ఏఐ సీసీ పెద్దలకు అందజేయగా, త్వరలో పదవిని భర్తీ చేయనున్నారు. డీసీసీ పదవుల భర్తీ విషయమై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌లతో ఢిల్లీలో కీలక సమావేశం ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలను కూడా సేకరించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో కాంగ్రెస్‌ను మరింతగా బలోపేతం చేయడంలో భాగంగా జిల్లాస్థాయి నాయకత్వ మార్పులపై కేసీ వేణుగోపాల్ చర్చించారు. దీంతో జిల్లాలోనూ డీసీసీ పదవి భర్తీలో మార్పులు జరిగే అవకాశాలున్నాయనే చర్చ జోరుగా సాగుతోంది.

ఆశల పల్లకిలో బీసీ నాయకులు..

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పీఠాన్ని బీసీలకే కేటాయిస్తారనే ప్రచారం జరుగుతుండటంతో ఆ పదవి కోసం దరఖాస్తు చేసుకున్న బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. డీసీసీ అధ్యక్ష పదవి కోసం జిల్లాలోని మూడు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో..

(తరువాయి 7లో)

బీసీ రిజర్వేషన్ల నేపథ్యంలో..

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతంగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన విషయం విదితమే. ఈ అంశానికి సంబంధించిన బిల్లు గవర్నర్ వద్ద పెండింగులో ఉండటంతోపాటు హైకోర్టులో కూడా బీసీ రిజర్వేషన్లపై తీర్పు వాయిదా పడటంతో రాష్ట్ర వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో బీసీ రిజర్వేషన్ల అంశం కీలకంగా మారింది. మరో వైపు ఢిల్లీలో జరిగిన సమావేశంలో డీసీసీల భర్తీ లోనూ ఆ దిశగా ఎంపి క ఉండాలనే అభిప్రాయాన్ని కేసీ వేణుగోపాల్ వ్యక్తం చేశారు. ఆయన వ్యాఖ్యల్లో బీసీ అంశాన్నే ప్రస్తావించారనే వాదన వినిపిస్తోంది. ఇదిలా ఉండగా డీసీసీల ఎంపికలో సామాజిక న్యాయం ఉంటుందని పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ కూడా స్పష్టం చేసినందున బీసీ అంశానికి బలం చేకూరుస్తుండగా, ఈ సారి డీసీసీ పదవి బీసీలకు ఇవ్వడం తథ్యమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సైబర్ నేరాలబారిన పడకుండా జాగ్రత్త పడాలి

సీపీ అంబర్ కిషోర్ ఝా


ఓపెన్‌హౌస్‌లో విద్యార్థులతో సీపీ అంబర్ కిషోర్ ఝా

మంచిర్యాల క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు సైబర్ నేరాల భారీన పడకుండా జాగ్రత్తగా ఉండాలని, పోలీసుల విధులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సీపీ అంబర్ కిషోర్ ఝా అన్నారు. సోమవారం పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థుల కోసం రామగుండం పోలీసు కమిషనరేట్‌లో పోలీసు ఓపెన్ హౌజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో చట్టపర అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వ హించామన్నారు. చట్టాల గురించి, పోలీసు విధులపై, భరోసా సెంటర్ గురించి, కమ్యునికేషన్ సిస్టంగురించి, ఫింగర్ ప్రింట్ డివైజ్‌ల వల్ల కలిగే ఉపయోగాలు, ట్రాఫిక్, తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. పోలీసులు ఉపయోగిస్తున్న సాంకేతికత గురించి అవగాహన కల్పించారు. పోలీసు వీరుల త్యాగాలు మరువ లేనివన్నారు. మహిళలు, బాలికలు రక్షణకు ఏర్పాటు చేసిన భరోసా కేంద్రం గురించి, వాటి పని తీరు, వివిధ యాప్‌ల గురించి అవగాహన కల్పించారు. ఏ సమస్య తలెత్తినా 100కు డయల్ చేస్తే తక్షణమే పోలీసులు స్పందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ శ్రీనివాస్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఏఆర్ ఏ సీపీ ప్రతాప్, సైబర్ క్రైం ఏసీపీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి నుంచి పనులు ప్రారంభించాలి

ఫారెస్టు బీట్ ఆఫీసర్ రామ్మోహన్


సమావేశంలో మాట్లాడుతున్న ఎఫ్‌బీవో రాంమోహన్

దండేపల్లి, అక్టోబరు, 27 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం నుంచి జన్నారం అటవీ విభాగంలోని మేదరిపేట సెక్షన్ లింగాపూర్ బీట్‌లో ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో వెదురు బొంగుల పెంపకంతో పాటు ఇతర తోటల సాగు పనులు ప్రారంభించాలని ఫారెస్టు బీట్ ఆఫీసర్ రామ్మోహన్ అన్నారు. బుధవారం దండేపల్లిలో ఆయన కంపార్టుమెంట్ 379, 380ల్లో జరు గుతున్న అక్రమ ఆక్రమణపై సంబందిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరస్థులు ఆక్రమణలను వెంటనే తొలగించాలని వీఎస్ఎస్‌తో పాటు గ్రామ పంచాయితీ తీర్మాణాలను అనువదించాలని కోరారు. సూచనలు ఆదేశాలు పాటించకుంటే పోలీసుల సమక్షంలో ఆక్రమణలు తొలగించి పనులు చేపడతామన్నారు. రెవెన్యూ, పంచాయితీ రాజ్, అటవీ అధికారులు పాల్గొన్నారు.

జ్యోతిబా పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఏర్పాటు చేయాలని బీసీ సంఘం నాయ కులు డిమాండ్ చేశారు. 1848లో మహిళల కోసం మొదటి పాఠశాలను ఏర్పాటు చేసిన నాటి నుంచి వారి జీవితాంతం సమాజం కోసం నిరంతర సేవలు అందించారని అన్నారు. అలాంటి మహానుభావులను నిరంతరం గుర్తుంచుకునేందుకు వారి విగ్రహాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో యుగంధర్ సాయి, సుందిళ్ల సంధ్యారాణి-నరేష్, వేముల కిరణ్, పాషా, ఇలటం కుమారస్వామి, రాకేష్, సూరారం సంపత్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం హైద్రాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ తుపాను వల్ల అకాల వర్షాల నేపథ్యంలో వరిధాన్యం, పత్తి కొనుగోలు ప్రక్రియకు ఎలాంటి అవాంతరాలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన టార్పాలిన్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్యాడీ క్లీనర్లు, తేమయంత్రాలు అవసరం మేకు సమకూర్చుకోవాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు జరిగేలా చూడాలన్నారు. బయటి రాష్ట్రాల నుంచి వచ్చే వరి, సోయాబీన్, కందులు, పెసల్ల అక్రమరవాణా జరగకుండా పర్యవేక్షించాలన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్‌మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలో 301 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి అన్ని ఏర్పాట్లతో సిద్దంగా ఉన్నామన్నారు. కేంద్రాల్లో తగిన సౌకర్యాలను కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) :ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ చంద్రయ్య అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మంచిర్యాల, వేంపల్లి, బెల్లంపల్లి, నెన్నెల తదితర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు దరఖాస్తులను అందజేశారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖా స్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించాలి


తాళ్లగురిజాల పోలీసుస్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీసీపీ భాస్కర్

బెల్లంపల్లి,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించాలని డీసీపీ భాస్కర్ అన్నారు. సోమవారం తాళ్లగురిజాల పోలీసుస్టేషన్‌లో వార్షిక తనిఖీల్లో భాగంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్‌లోనే కేసులకు సంబంధించిన వివరాలను పోలీసు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా ప్రవర్తించాలని, అదే విధంగా పెండింగ్ కేసులను త్వరిత గతిన పరిష్కరించాలని సూచించారు. రౌడి షీటర్స్ చరిత్ర ఉన్న అనుమానితులపై నిరంతరం నిఘా పెట్టాలని సూచించారు. సైబర్ నేరాలు, సీసీ కెమెరాల వినియోగంపై అవ గాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం నేరాల నియంత్రణ కోసం కఠినంగా వ్యవ హరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రవి కుమార్, రూరల్ సీఐ హనోక్, ఎస్ఐ రామకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా మద్యం షాపుల ఎంపిక ప్రక్రియ

ఎంపికైన వారు నిబంధనల ప్రకారం చెల్లించాల్సిన డిపాజిట్ మొత్తాన్ని చెల్లించాలి

కలెక్టర్ కుమార్ దీపక్



నస్పూర్‌లో పీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో మద్యం షాపుల కేటాయింపుకు లాటరీలో వచ్చిన నంబరును చూపిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మద్యం షాపుల ఎంపిక ప్రక్రియ ప్రశాంతంగా సాగిందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం తీగల్ పహాడ్‌లోని పీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో దరఖాస్తుదారుల సమక్షంలో కలెక్టర్‌తో పాటు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి నందగోపాల్ ఆధ్వర్యంలో ఒక్కొక్క షాపు లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. జిల్లాలో 2025-27 సంవత్సరాలకు గాను 73 మద్యం షాపులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. లక్కీ డ్రా కోసం వినియోగించిన టోకెన్‌లను అందరికి చూపిస్తూ ప్రక్రియను ప్రారంభించారు. డిసెంబరు ఒకటి నుంచి కొత్త షాపులు అమలులోకి రానున్నాయి. గౌడ్ కులస్తులకు-6, ఎస్సీ- 10, ఎస్టీ-6, జనరల్ కోట-51, మొత్తం 73 షాపులు కేటాయించారు. జిల్లాలో 73 మద్యం షాపులకు సెప్టెంబరు 26 నుంచి అక్టోబరు 23 వరకు కొత్త షాపులకు దరఖాస్తులు స్వీకరించగా జిల్లా వ్యాప్తంగా 1712 దరఖాస్తులు వచ్చాయి. లాటరీలో షాపులు వచ్చిన వారిలో ఆనందం వెల్లివిరియగా, డ్రాలో షాపులు దక్కకపోవ డంతో చాలా మంది నిరాశతో వెనుతిరిగారు. ఈ సందర్భంగా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ మద్యం షాపుల కేటాయింపులు లాటరీ పద్ధతిని వీడియో, ఫొటో చిత్రీకరణల మధ్య నిర్వహించామన్నారు. ఎంపిక ప్రక్రియ ప్రశాంతంగా సాగిందన్నారు. లాటరీలో ఎంపికైన అభ్యర్థులు నిబంధనల ప్రకారం చెల్లించాల్సిన డిపాజిట్ మొత్తాన్ని చెల్లించాల న్నారు. లైసెన్స్ ఫీజు రూపేణా నిర్దీత రుసుం చెల్లించడా నికి వీలుగా వేదిక వద్దనే బ్యాంకు వారిచే కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. మిగతాది డిపాజిట్ మొత్తం ప్రభుత్వం నిర్ణయించిన దశల వారీగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. డిసెంబరు ఒకటి నుంచి కొత్త షాపులు అమలులోకి వస్తాయని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, పోలీస్ అధికారులు, ఎక్సైజ్ శాఖ అధికారులు, జిల్లా లోని వివిధ మండలాలకు చెందిన లబ్ధిదారులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ICICI Bank

నమోదిత కార్యాలయం : ICICI బ్యాంక్ టవర్, చక్లి సర్కిల్ సమీపాన, పాత పద్రా రోడ్, వడోదర - 390 007
కార్పొరేట్ కార్యాలయం : ICICI బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, ముంబాయి 400 051.

బంగారం ఇ-వేలం సహిత ఆహ్వాన ప్రకటన

ICICI బ్యాంక్ లిమిటెడ్ ("ICICI బ్యాంక్") నుండి వారిచే వినియోగించబడిన బంగారు ఆభరణాలపై ఋణవసతి ("వసతి")గా పొందిన వారి బకాయి మొత్తములను చెల్లించవలసినదిగా దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతలకు నోటీసులు జారీ చేయబడినవి. తమ బకాయిలను తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, తప్పనిసరి పరిస్థితిలో నవంబర్ 07, 2025న తనఖా చేయబడిన బంగారు ఆభరణములకు మేము ఇ-వేలము నిర్వహించుచున్నాము. ముందస్తు సమాచారం లేకుండా ఖాతాను తొలగించు / వేలము తేదీని మార్చు హక్కును ICICI బ్యాంక్ కలిగియున్నది. ఇ-వేలము ఆన్‌లైన్ ద్వారా మ.12.30 గం. నుండి మ.3.30 గం.ల మధ్య https://gold.samil.inలో నిర్వహించబడును. సవివర నియమ నిబంధనల కొరకు దిగువ ఇచ్చిన వెబ్‌సైట్‌కు లాగిన్ అవ్వండి. ఒకవేళ ఋణగ్రహీత మరణించినచో న్యాయవారసులకు అన్ని నిబంధనలు వర్తిస్తాయి.

ఋణ ఖాతా నెం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: భైంసా	
395562004099	భూర్జూషివార్ సంజీవ్ భూమారెడ్డి
శాఖ పేరు: భూపాలపల్లి	
440062000367	బడితల సుమన్
శాఖ పేరు: గద్వాల్	
092062015331	వడ్డె మంకన్న
శాఖ పేరు: హైదరాబాద్ - జూబ్లీహిల్స్ రోడ్ 45	
754162000414	మూల సంకీర్త్ రెడ్డి
శాఖ పేరు: హైదరాబాద్ - ఆర్‌టీసీ క్రాస్‌రోడ్	
194262001559	భూక్య కిషోర్ బాబు
శాఖ పేరు: జగిత్యాల	
280862009787	మహ్మద్ అజీద్ ఖాన్

ఋణ ఖాతా నెం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: ఖమ్మం - గాంధీ చౌక్	
130805006550	అల్లం రాంబాబు
శాఖ పేరు: కోజానివాదిపల్లి	
222262000588	అంజనేయులు గుడిసె
శాఖ పేరు: కొత్తగూడెం	
068562009270	ఇంట్ల రమేష్
శాఖ పేరు: మణికొండ, తెలంగాణ	
322262001813	బాసర్ల శ్వేత
శాఖ పేరు: మెదక్	
069062025259	బక్కా అంజనేయులు
069062025264	లంబాడి గోపాల్
శాఖ పేరు: పెద్దపల్లి	
068362020736	కొమిరె సాగర్

ఋణ ఖాతా నెం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: కుత్బుల్లాపూర్	
130462002498	అమిరిసేని రాజేష్
130462002563	అమిరిసేని రాజేష్
శాఖ పేరు: సత్తుపల్లి	
792562000373	నాగేంద్ర తిరుమలేష్
శాఖ పేరు: సిరిసిల్ల, తెలంగాణ	
363262008011	అంబటి మల్లయ్య
శాఖ పేరు: ఉతనూర్	
222462000879	తిమ్మన్న తిమ్మన్న
శాఖ పేరు: వెల్లుల్ల	
221362001676	దోస నరేందర్
శాఖ పేరు: దుర్గ్	
062362001384	షఫీయూర్ రెహమాన్

తేది : 28.10.2025
ప్రదేశం: హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, మెదక్, పెద్దపల్లి, జగిత్యాల, జోగులాంబ (గద్వాల్), వనపర్తి, నిజామాబాద్, ఖమ్మం, నిర్మల్, రాజన్న (సిరిసిల్ల), భద్రాద్రి (కొత్తగూడెం), జయశంకర్ (భూపాలపల్లి), సూర్యాపేట

సం/- అధీకృత అధికారి, ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరఫున

